సాక్షి
తిరుపతి

బుధవారం ၊ 2 ၊ అక్టోబర్ ၊ 2024



కాంచిన కనులదే భాగ్యం

జెండా పండుగకు గూడూరు పట్టణం శోభాయమానంగా ముస్తాబైంది. విద్యుత్ కాంతులీనుతోంది. - 10లో



విజన్ 2047పై వర్క్‌షాప్

కలెక్టరేట్‌లో మంగళవారం స్వర్ణాంధ్ర విజన్ 2047పై జేసీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. - 10లో



మద్యం దుకాణాలు బంద్

ప్రభుత్వం మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఉద్యోగ భద్రత కోరుతూ మంగళవారం నిరసనకు దిగారు. - 10లో

న్యూస్‌రీల్

రేపటి నుంచి దసరా సెలవులు

తిరుపతి ఎడ్యుకేషన్ : విజయదశమిని పురస్కరించుకుని ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటిస్తున్నట్లు డీఈఓ శేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని వెల్లడించారు. దసరా సెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పకడ్బందీగా ఫొటో వెరిఫికేషన్



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఫొటో ఎలక్టోరల్ రోల్–2025 వెరిఫికేషన్ ప్రక్రియను పకడ్బందీగా గడువు లోపు పూర్తి చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం అమరావతి నుంచి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ వీడియా కాన్ఫరెన్స్ ద్వారా ఫొటో ఎలక్టోరల్ రోల్‌పై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫొటో ఎలక్టోరల్ జాబితా వెరిఫికేషన్‌ను 99.81 శాతం పూర్తి చేశామని చెప్పారు. అన్ని ఫారమ్స్‌కు సంబంధించి 25,473 పెండింగ్ క్లెయిమ్స్, అభ్యంతరాలు ఉన్నాయని, వాటిలో పురోగతి చూపుతున్నట్లు వెల్లడించారు. జనన, మరణాల గణాంకాలకు సంబంధించి 7,117 దరఖాస్తుల్లో 6,305 వెరిఫికేషన్ అయిపోయిందన్నారు. మరో 812 దరఖాస్తులను ఈ నెల 3వ తేదీకి పూర్తి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్‌ఓ పెంచల కిషోర్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా సుధారాణి



ఉత్తర్వులు అందుకుంటున్న సుధారాణి

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ కె సుధారాణిని నియమిస్తూ వీసీ సీహెచ్ అప్పారావు , రిజిస్ట్రార్ భూపతి నాయుడు మంగళవారం ఉత్తర్వులు అందజేశారు. 1992లో వయోజన విద్యావిభాగంలో అధ్యాపకులుగా సుధారాణి ప్రస్థానం ప్రారంభించారు. 32 ఏళ్లుగా వర్సిటీలో బోధనానుభవం గడించారు. ప్రిన్సిపల్‌గా నియమితులైన సుధారాణికి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

'వరల్డ్ బెస్ట్ టీచర్' అవార్డుకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్ : ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ బెస్ట్ టీచర్ ఇంటర్నేషనల్ అవార్డ్స్–2024 ప్రదానం చేయనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈఎస్ఎస్ నారాయణ మాస్టర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అవార్డు ఎంపికకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయులకు అవార్డులు అందిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తమ దరఖాస్తుతో పాటు విద్యార్హతలు, బోధన, శిక్షణ అనుభవాలతో పూర్తి వివరాలు గల సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలను పంపాలని కోరారు. దరఖాస్తులను ఈనెల 5వ తేదీలోపు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబర్ : 1–20–164, గోకుల్ నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్–15 చిరునామాకు పంపించాలని సూచించారు. ఎంపికైన వారికి హైదరాబాద్‌లో ఈనెల 13వ తేదీన నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9652347207 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 66,986 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.5.05 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

పవిత్రం.. ప్రసాదం



ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలతో ముఖ్యమంత్రి చంద్రబాబు చెలగాట మాడారు.. మహిమాన్వితమైన శ్రీవారి సన్నిధిని క్షుద్ర రాజకీయాలకు వేదికగా మార్చుకున్నారు. పవిత్ర ప్రసాదంపై అసత్య ఆరోపణలతో విషంగక్కారు. ఏడుకొండలస్వామికి చిత్తశుద్ధితో సేవలందించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దారుణంగా బురదజల్లేందుకు యత్నించారు. కలియుగ వైకుంఠం ప్రతిష్టను దెబ్బతీసేందుకు కుయుక్తులు పన్నారు. అయితే చంద్రబాబుకు సాక్షాత్తు దేవదేవుడే తగిన గుణపాఠం చెప్పారు. సుప్రీం కోర్టు రూపంలో వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు. శ్రీవారి భక్తులకు అత్యంత ప్రీతికరమైన లడ్డూలపై తలెత్తిన సందేహాలను పూర్తిగా తొలగించారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను పరిరక్షించారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. దుందుడుకుగా అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబుపై మండిపడుతున్నారు. ఆయనకు తగుదునమ్మా అంటూ వంతపాడిన పవన్ కల్యాణ్ తదితర కూటమి నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సద్బుద్ధితో నడుచుకోవాలని సూచిస్తున్నారు.

– తిరుపతి సిటీ/పలమనేరు/ కాణిపాకం/ కుప్పం



- ముఖ్యమంత్రి ఆరోపణలు అవాస్తవం
- శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి పేరిట అసత్య ప్రచారం
- సుప్రీం కోర్టు వ్యాఖ్యలపై భక్తుల హర్షాతిరేకం
- కూటమి నేతల రాద్ధాంతంపై వెల్లువెత్తిన ఆగ్రహం
- సద్బుద్ధితో మెలగాలని సూచిస్తున్న ప్రజానీకం

సర్కార్‌కు చెంపదెబ్బలు



తిరుమల శ్రీవారి లడ్డూ వ్యవహారంలో కూటమి సర్కారుకు సుప్రీంకోర్టులో చెంప దెబ్బలు పడ్డాయి. దేవుడిని కూడా రాజకీయాల కోసం వాడుకోవడం బాధ్యతా రాహిత్యమని చంద్రబాబుకు చీవాట్లు పడ్డాయి. కోట్ల మంది హిందువుల మనోభావాల్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం దారుణం. చంద్రబాబు వేసిన సిట్ దర్యాప్తు నివేదిక సత్యదూరంగానే ఉంటుందని అందరికీ తెలుసు. ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్తం చేసుకుంటూ దీక్ష చేపట్టారు.

– మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

ప్రజలకు అర్థమైంది



ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఆధారాలతో పనిలేకుండా, అసలు విషయం తెలుసుకోకుండా అనవసరంగా దేవుడితో రాజకీయాలు చేశారు. ఇది ఎవరికీ మంచిది కాదు. ఇచ్చిన హామీలనుంచి ప్రజల దృష్టిని తప్పించేందుకే ఇలాంటి పన్నాగాలు పన్నారు. ఇది పూర్తిగా ప్రజలకు అర్థమైంది. ఇప్పుడు సుప్రీం ప్రకటనతోనైనా ఆయనకు బుద్ధి చేకూరాలి. భక్తుల మనోభావాలతో ఆటలాడుకోవడం సరికాదు. ఇందుకు కారణమైన వారిని దేవదేవుడు వదిలిపెట్టడు.

– సోమచంద్రారెడ్డి, జిల్లా మేధావుల ఫోరమ్ అధ్యక్షుడు

ఏడుకొండలవాడే చెప్పించాడు



రాజకీయాలకు దేవుడిని వాడుకోవడం తగదు. సుప్రీం కోర్టు న్యాయమూర్తుల మాటలు వింటే సాక్షాత్తు ఆ ఏడుకొండలవాడే చెప్పించినట్టు అనిపించింది. రాజకీయ నేతలు ఎవరి మత విశ్వాసాలు, మనోభావాలను దెబ్బతీసేందుకు ప్రయత్నించకూడదు. అబద్ధం వెంటనే జనంలోకి వెళ్లిపోయినా, నిజం నిలకడగా అయినా తెలుస్తుంది. అప్పుడు సదరు నాయకుల స్థాయి పడిపోతుంది. శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ కాలేదనే వాస్తవంతో సంతోషమేసింది.

– విజయ్‌కుమారస్వామి, కీలపట్ల

ఇది మహాపచారం



స్వామివారి ప్రసాదంపై అభ్యంతరకరమైన వార్తలు వినడం దురదృష్టకరం. నిజానిజాలు తెలియకుండా దుష్ప్రచారం చేయడం మంచిదికాదు. అలా చేస్తే స్వామివారి ఆగ్రహానికి గురికాక తప్పదు. శ్రీవేంకటేశ్వర స్వామి భక్తులను తప్పుదోవపట్టించేందుకు ప్రయత్నించిన వారు ఎవరూ మనుగడ సాగించలేదు. శ్రీవారికి ఇది నిజంగా మహాపచారం. దీనిపై సుప్రీం కోర్టు సైతం అక్షింతలు వేసిందంటే ఈ ప్రభావం భక్తులలో ఎలా ఉంటుందో ఆలోచించాలి.

– శేషాచలేశ్వరాచార్యులు, అర్చకుడు, తమిళనాడు

భక్తులకు భరోసానిచ్చింది.



శ్రీవారి ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకంపై వస్తున్న వార్తలకు సుప్రీం కోర్టు బ్రేక్ వేసినట్టయింది. భక్తులకు భరోసా ఇచ్చింది. ఎంతో పవిత్రంగా భావించే స్వామివారి ప్రసాదానికి దేశ, విదేశాలలో అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రసాదంతో రాజకీయాలు చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడటం దారుణం. కల్తీ విషయంలో కచ్చితమైన సమాచారం ఉంటే అధికారులు, పండితులు మాట్లాడాలి. రాజకీయ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అపచారం. – వరదరాజులస్వామి, తిరుపతి రూరల్

రాజనీతికి వ్యతిరేకం



దేవుళ్లతో రాజకీయాలు చేయడం. తమ అవసరాలకు తగ్గట్టు మాట్లడడం చాలా ప్రమాదకరం. ఇది రాజనీతికి వ్యతిరేకం. కలియుగ దైవం ఎంతో మంది భక్తులను నిత్యం తన వద్దకు రప్పించుకుని దర్శన భాగ్యంతో ఆశీస్సులు అందజేస్తున్నారు. ఆ సమయంలో తన వద్దకు వచ్చిన భక్తులకు ఇచ్చే మహా ప్రసాదమే లడ్డూ. అటువంటి ప్రసాదంపై అభాండాలు మోపడం ఎంతవరకు సమంజసం. శాస్త్రాలు సైతం ఇలాంటి వాటిని సమ్మతించదు.

– మణికంఠ, అర్చకుడు, తిరువళ్లూరు

సమంజసం కాదు



శ్రీవారి లడ్డూను అడ్డంపెట్టుకుని చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాజకీయం చేశారు. లడ్డూ పవిత్రతను దెబ్బతీసేందుకు యత్నించారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించారు. చేసిందంతా చేసి మళ్లీ ప్రతిపక్షంపై బురద జల్లడం సమంజసం కాదు. సుప్రీంకోర్టు అందుకే మొట్టికాయలు వేసింది. తిరుమల శ్రీవారే వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చారు. కూటమి నేతలు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి.

– వెంకటరత్నం, కార్వేటినగరం

సత్యం బయటపడింది



తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అన్యాయంగా ఆరోపణలు చేశారు. పైగా అప్పటి ప్రభుత్వంపై బురదజల్లారు. క్షుద్ర రాజకీయాలను దేవుడు కూడా క్షమించడు. అందుకే సుప్రీం కోర్టులో చంద్రబాబుకు అక్షింతలు పడ్డాయి. ఇన్నాళ్లుగా చేసిన విష ప్రచారం ప్రజలకు అర్థమైంది, సత్యం బయటపడింది. మరోసారి ఇలాంటి కుట్రలకు తెరతీయకుండా ముఖ్యమంత్రి మంచిగా మారాల్సిన అవసరముంది.

– నాగార్జున, ఐరాల

క్షమాపణ చెప్పాల్సిందే



శ్రీవారి లడ్డూకు వినియోగించిన నెయ్యి కల్తీ అనే వార్త వినగానే గుండె పగిలినంత పనైంది. అయ్యో దేవుడా ఏమిటిది అనుకుంటూ చాలా బాధపడ్డాం. అయితే సుప్రీంకోర్టు విచారణలో నిజనిజాలు బయటకు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేశారనే వాస్తవం అందరికీ అర్థమైంది. ఇంత దారుణానికి తెగించిన కూటమి నేతలు భక్తులకు క్షమాపణలు చెప్పాల్సిందే. లేకుంటే వారి పాపానికి పరిహారం ఉండదు.

– తేజశ్విత, యాదమరి

ఆరోపణలు బాధాకరం



తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి పవిత్ర ప్రసాదమైన లడ్డూలో కల్తీ నెయ్యి కలిసిందనే ఆరోపణలు బాధాకరం. ఏది ఏమైనా రాజకీయాలకు దేవదేవుడిని వాడుకోవడం దురదృష్టకరం. కోట్ల మంది శ్రీవారి భక్తుల మనోభావాలతో ఆడుకోవడం దారుణం. ఇప్పుడు సుప్రీం కోర్టు వ్యాఖ్యలతో మా మనసులు శాంతిస్తున్నాయి. ఇన్నాళ్లుగా మనోవేదనకు గురిచేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కచ్చితంగా భక్తకోటికి క్షమాపణలు చెప్పాలి.

– బాల సుబ్రమణ్యస్వామి, కుప్పం

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



సూళ్లూరుపేట : చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రులు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ బి.ప్రసన్నలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రోజుకో అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నట్లు వెల్లడించారు. భక్తులు తమ పేర్లు, గోత్రనామాలను పంపితే వారి పేరిట ప్రత్యేక పూజలు జరిపిస్తామన్నారు. నవరాత్రులను పురస్కరించుకుని ప్రతి రోజూ ఒక్కో ప్రాంతం వారు సారె సమర్పించనున్నట్లు తెలిపారు. 3న గొల్లలములువు, 4న సూళ్లూరుగంటమిట్ట, కాపు వీధి, కావలివీధి, శ్రీ పొట్టిశ్రీరాములు వీధి, రైల్వే కాలనీ, శ్రీనగర్‌కాలనీ, 5న మన్నారుపోలూరు, నూకలపాళెం, వట్రపాళెం, 6న కోళ్లమిట్ట, రాఘవయ్యపేట, రాజీవ్‌నగర్, ఇసుకమిట్ట, రైల్వేగేట్, హనుమాన్‌వీధి, 7న గాండ్లవీధి, బాపూజీవీధి, కచ్చేరివీధి, పార్కువీధి, 8న కస్పారెడ్డిపాళెం, డేగలపాళెం, సోనియాగాంధీనగర్, బాపూజీకాలనీ 9న సాయినగర్, పరమేశ్వరినగర్, మహాదేవయ్యనగర్, ఝాన్సీనగర్, సంజీవయ్య నగర్, ఇందిరానగర్, 10న సూళ్లూరు, నాగరాజపురం, వాటంబేడు రోడ్డు, 11న పోలీస్‌శాఖవారు, 12న ఆఖరిరోజున ఎమ్మెల్యే సారె సమర్పించనున్నట్లు వివరించారు.

వైభవంగా శ్రీవారి గొడుగుల ఊరేగింపు



పుత్తూరులో శ్రీవారి గొడుగుల ఊరేగింపు

పుత్తూరు: పట్టణంలో శ్రీవారి గొడుగుల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల నిమిత్తం చెన్నై నుంచి తిరుమలకు వెళుతున్న శ్రీవారి గొడుగులు మంగళవారం ఉదయం పుత్తూరుకు చేరుకోగానే మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక ఆర్డీఎం గేటు వద్ద శ్రీవారి పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివానందస్వామి, కైలాస నందగిరిస్వామి, కృష్ణచైతన్యస్వాముల వారు ఊరేగింపును ప్రారంభించారు. అడుగడుగునా శ్రీవారి పాదుకలకు భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు.

పెన్షన్.. అదే టెన్షన్





యశోదనగర్‌లోని సచివాలయాల వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు

- గందరగోళంగా పింఛన్ల పంపిణీ
- తీవ్రంగా ఇబ్బంది పడిన పండుటాకులు
- పట్టించుకోని అధికారులు

తిరుపతి తుడా : తిరుపతి నగరంలో సామాజిక పింఛన్ల పంపిణీ మంగళవారం గందరగోళంగా మారింది. ఇంటింటికీ పింఛన్ సొమ్ము పంపిస్తామని ప్రభుత్వం ఊదరగొట్టినా క్షేత్రస్థాయిలో ఏమాత్రం అమలు కాలేదు. దీంతో వ్యయప్రయాసకోర్చి అవ్వాతాతలు ఆయా సచివాలయాలకు చేరుకున్నారు. అయితే సిబ్బంది విధులకు ఆలస్యంగా రావడంతో పండుటాకులకు ఇబ్బందులు తప్పలేదు. పైగా సర్వర్లు మొరాయించాయంటూ నగదు పంపిణీ చేయకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తిండీ తిప్పలు లేక అల్లాడాల్సిన దుస్థితి దాపురించింది. తిరుపతిలోని 23 సచివాలయాల పరిధిలో ఇదే కొనసాగింది. మధ్యాహ్నం 12 గంటలు దాటినా పింఛన్‌ల పంపిణీ మొదలు కాలేదు.

వృద్ధుల అవస్థ వర్ణనాతీతం

పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధుల అవస్థలు వర్ణనాతీతం. షుగర్, బీపీ, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారు గంటల తరబడి వేచి ఉండలేక తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఓపిక నశించినా, నీరసంతో ఇంటికి తిరిగి వెళ్లలేక సచివాలయ ప్రాంగణాల్లో నిద్రించడం కనిపించింది. వలంటీర్ వ్యవస్థ ఉన్నప్పుడు వేకువజామునే ఇంటికి తీసుకువచ్చి పింఛన్ ఇచ్చేవారని, అలాగే పంపిణీ చేస్తామని చెప్పి మభ్య పెట్టి ఓట్లు వేయించుకుని కూటమి ప్రభుత్వం చుక్కలు చూపిస్తోందని పలువురు వ్యాఖ్యానించడం వినిపించింది.

లోపించిన పర్యవేక్షణ

పింఛన్ పంపిణీని పర్యవేక్షించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. అక్కారంపల్లె, సుబ్బారెడ్డి నగర్‌లో మాత్రం ఇద్దరు లబ్ధిదారులకు కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్, ఎమ్మెల్యే కలిసి పంపిణీ అందించి చేతులు దులిపేసుకుని వెళ్లిపోయారు. మిగిలిన ప్రాంతాల్లో పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా, ఏమైనా సమస్యలు తలెత్తాయా అనే విషయాలను పూర్తిగా విస్మరించారు. మంచానికి పరిమితమైన వారు ఇంట్లోనే ఎదురుచూపులు చూసే పరిస్థితి వచ్చింది. ఎవరూ వచ్చి పింఛన్ నగదు అందించకోవడంతో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ఈ క్రమంలో అధికారులు కేవలం చర్చలకు మాత్రమే పరిమితం కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తారు

తిరుపతి అర్బన్ : సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తారని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. తిరుపతిలోని అక్కారం పల్లె, సుబ్బారెడ్డి నగర్‌లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్యతో కలిసి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీలో జిల్లా రాష్ట్రంలోనే నాలుగో స్థానంలో ఉందని వివరించారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

సరుకులకు ప'రేషన్'

- కార్డుదారులకు బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ
- కందిపప్పు, చిరుధాన్యాలు సరఫరా చేయని ప్రభుత్వం

తిరుపతి అర్బన్ : జిల్లాలో మొత్తం 1,457 చౌకదుకాణాలు ఉన్నాయి. 6.03లక్షల మంది కార్డుదారులు ఉన్నారు. అయితే రేషన్‌షాపుల్లో డీలర్లు నాలుగు నెలలుగా కేవలం బియ్య మాత్రమే కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. ఇందులో రెండు నెలల నుంచి చక్కెర అరకేజీ లెక్కన ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నార. కందిపప్పు, ఇతర నిత్యావసర సరుకులు ఇవ్వకపోవడంతో పేదలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో రేషన్ పంపిణీని మంగళవారం మొదలుపెట్టారు. ఈ నెల 18వ తేదీ వరకు కార్డుదారులకు అందించనున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రేషన్ దుకాణాల్లో బియ్యంతోపాటు చక్కెర, గోధుమపిండి, రాగిపిండి, రాగులు , కంది పప్పు తదితర వస్తువులను పంపిణీ చేసేవారు. చిరుధాన్యాలు సైతం కార్డుదారులకు అందించాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే రాష్ట్రంలోకూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో చిరుధాన్యాల పంపిణీకి చెక్ పడింది. ఈ క్రమంలోనే పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ .తాము కార్డుదారులకు అన్ని సరుకులు అందిస్తామని ఊదరగొట్టారు. అయితే ఇప్పటి వరకు కనీసం కందిపప్పు కూడా ఇవ్వలేకపోయారు. మరోవైపు జిల్లాలోని 369 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి వెళ్లి గతంలో సరుకులు అందించేవారు. వాటికీ టీడీపీ సర్కార్ మంగళం పలుకుతోంది. ఇప్పటికే 50శాతం వాహనాలను అందుబాటులో లేకుండా చేసేసింది. అయినప్పటికీ సక్రమంగా సరుకులన్నీ ఇస్తే చాలనుకున్న కార్డుదారులకు ప్రతి నెలా నిరాశనే మిగులుస్తోంది.

బియ్యం సరఫరా చేశాం



జిల్లాలోని రేషన్ దుకాణాలకు గోదాముల నుంచి బియ్యం సరఫరా చేశాం. రెండు నెలలుగా చక్కెర ఇస్తున్నాం. కందిపప్పు రాలేదు. వస్తే డీలర్లకు తప్పకుండా పంపుతాం. గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు ఎలాంటి తేడాలు లేకుండా కచ్చితమైన తూకాలతో సరుకులు అందించాం. ప్రభుత్వం నుంచి ఏవి వస్తే ఆ సరుకులను రేషన్ దుకాణాలకు పంపడానికి సిద్ధంగా ఉన్నాం.

– సుమతి, సివిల్ సప్లయి జిల్లా మేనేజర్

క్లుప్తంగా

కాలేజీ బస్సు బోల్తా

– నలుగురు విద్యార్థులకు గాయాలు



బోల్తాపడిన ఇంజనీరింగ్ కళాశాల బస్సు

చిల్లకూరు : కోట మండలం విద్యానగర్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల మంగళవారం చిల్లకూరు మండలం కొత్తపాళెం మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో నలుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కళాశాల బస్సు ముత్తుకూరు ప్రాంతంలోని 35 మంది విద్యార్థులతో కాలేజీకి వస్తుండగా ప్రమాదం జరిగింది. నాగమణి, వెంకట సుబ్బయ్య, ఝాన్సీ, కులదీపక్ అనే విద్యార్థులు గాయపడ్డారు. క్షతగాత్రులను గూడురు ఏరియా ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ చాంద్ బాషా మద్యం తాగి బస్సు నడపడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఎస్‌ఐ సురేష్‌బాబు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.


కాంచిన కనులదే భాగ్యం

విద్యుత్ దీపాల మిరుమిట్లు.. ఆధ్యాత్మికత పంచుతున్న దేవతా మూర్తుల కటౌట్లు.. కాంచిన కనులదే భాగ్యం అన్నట్లు మెరిసిపోతోంది సిలిక పట్టణమైన గూడూరు. ఈ పట్టణం ఖనిజ సంపదకే కాదు.. ఆధ్యాత్మికతకు నిలయంగా అలరారుతోంది. దసరా ముందు రోజు నిర్వహించే జెండా పండుగే ఇందుకు నిదర్శనం. దేశంలో కర్ణాటకలోని మైసూరు తరువాత గూడూరులోనే ఈ ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

- గూడూరులో నేడు జెండా పండుగ
- విస్తృతంగా ఏర్పాట్లు
- దసరాకు ముందుగా సన్నాహక పండుగ
- మైసూరు తరువాత గూడూరుకు ప్రాధాన్యం



కన్యకా వీధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ కటౌట్



చెంగాళమ్మ దేవస్థానం వద్ద రాధాకృష్ణుల చిత్రాలు

చిల్లకూరు: గూడూరులో 78 ఏళ్లగా కర్ణాటకలోని మైసూరులో జరిగే జెండా పండుగ తరువాత స్థానంలో గూడూరును నిలిపేలా దసరాకు ముందుగా వచ్చే జెండా పండుగను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వాతంత్రం వచ్చిన తొలినాళ్లలో గూడూరులో పలు రకాల వ్యాధుల బారిన పడి పలువురు మృతి చెందుతుండడంతో స్థానికులు ఒకటిగా మాట్లాడుకుని నేడు బొడ్డుచౌక అనే ప్రాంతంలో తెల్లని వస్త్రంపై సంజీవని పర్వతం మోస్తున్నట్లు బొగ్గుతో గీసిన హనుమంతుని చిత్రాన్ని గీసి, 8 అడుగుల వెదురు కర్రపై జెండాను అమర్చి గ్రామోత్సవం చేశారు. అప్పుడు గ్రామంలోని ప్రజలు వ్యాధుల బారిన పడిన వారి సంఖ్య తగ్గడంతో ఇక అప్పటి నుంచి విజయదశమి ముందు వచ్చే అమావాస్య రోజున ఈ జెండా పండుగను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. గూడూరు పట్టణంలో జనాభా బాగా పెరిగి పోవడంతో చుట్టు పక్కల ఉండే చెన్నూర్రు, చిల్లకూరు, మనుబోలు, తిక్కవరం, చేడిమాల గ్రామాల్లో జెండా పండుగను నిర్వహిస్తున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల జోరు

తొలినాళ్లలో జెండా పండుగను సంప్రదాయంగా మేళ తాళాలతో డప్పు వ్యాయిద్యాలతో ఊరేగింపు చేసే వారు. అయితే నేడు కొత్తగా పలు పలు రకాల సౌండ్ సిస్టమ్స్ రావడంతో అటు దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే జెండా పండుగ సందర్భంగా పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే జెండా ఉత్సవంలో బేతాళ నృత్యాలు, మహంకాళీ నృత్యాలు , పండరి భజన, కులుకు భజనలు, కోలాటాలు, కీలు గుర్రాలు, డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నారు.

భారీ విద్యుత్ కటౌట్‌లు

పట్టణంలోని పలు ప్రాంతాల్లో జెండా పండుగను నిర్వహించే వారు ప్రతిఏటా విద్యుత్ దీపాలతో చేసిన పెద్దపెద్ద కటౌట్‌లు పోటాపోటీగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే గమ్మళ్లపాళెం, బజారువీధి, ఆస్పత్రి రోడ్డు, కోనేటిమిట్ట, బొడ్డుచౌక, సంగం థియేటర్ ప్రాంతంలో అయితే 60 అడుగులకు పైగా విద్యుత్ దీపాలతో కటౌట్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

పట్టణంలో 60 ప్రాంతాలకు పైగా ..

జెండా పండుగను మొదటగా ఒకటి రెండు చోట్ల చేసేవారు. అయితే రానురాను ప్రతి వీధిలో యువత తమ వంతుగా జెండా పండుగను చేయాలని భావించి ప్రస్తుతం పట్టణంలో సుమారు 60 ప్రాంతాల్లో జెండా పండుగను నిర్వహించి, ఆంజనేయస్వామి జెండాలు ఎగుర వేస్తున్నారు.

దేశ విదేశాల నుంచి రాక

గూడూరుతో పాటుగా పరిసర ప్రాంతాల్లో నివసిస్తూ ఇతర దేశాలు, రాష్ట్రాలలో స్థిరపడిన వారంతా జెండా పండుగకు గూడూరుకు తరలి వచ్చి పండుగలో పాల్గొంటారు. ఈ క్రమంలో ఇతర దేశాలలో వివిధ రంగాల్లో పని చేస్తున్న వారు అక్టోబర్ 2వ తేదీన జరిగే జెండా పండుగకు హాజరవుతున్నట్లు తెలుస్తుంది.

చిన్న పిల్లలకు ఆహ్లాదం

జెండా పండుగకు వచ్చే చుట్టు పక్కల వారి పిల్లలకు మంచి ఆహ్లాదకరంగా ఉండేలా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ఉన్నారు. ఇక్కడ రంగుల రాట్నం, (జెయింట్ వీల్). డిస్కో,లాంటి ఎన్నో రకాల ఆట వస్తువులు ఏర్పాటు చేసి ఉన్నారు.

నిబంధనల మేరకు నడుచుకోవాలి



జెండా పండుగ నిర్వాహకులు తమకు నిబంధనలు మేరకు నడుచుకోవాలని, వాటిని అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని గూడూరు డీఎస్పీ రమణకుమార్ హెచ్చరించారు. జెండా పండుగకు 350 మంది పోలీసులను నియమించామన్నారు. ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని తెలిపారు. ఎటువంటి అల్లర్లకు తావు లేకుండా కమిటీ సభ్యులు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, ఎస్‌ఐలు గోపాల్, తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ సిద్ధం



ఆర్టీసీ ఎండీ, డీజీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : తిరుమల బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ సిద్ధంగా ఉందని కడప జోన్ ఈడీ, జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఈ మేరకు తిరుమలలో ఆర్టీసీ ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఇప్పటికే ఐదు దశలుగా ఆర్టీసీ సర్వీసులను తనిఖీలు చేశామన్నారు. ప్రతిరోజు 1,930 ట్రిప్పులు తిప్పడానికి సన్నాహాలు పూర్తి చేసినట్లు వెల్లడించారు. దీంతో రోజుకు 1.70లక్షల మంది భక్తులకు తిరుపతి–తిరుమల రాకపోకలు సాగించవచ్చని తెలిపారు. గరుడ సేవకు 2,714 ట్రిప్పులు నడపనున్నట్లు చెప్పారు. సుమారు 2.50 లక్షల మంది భక్తులను తరలించవచ్చని వివరించారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్, తిరుపతి డిప్యూటీ సీడీఎం భాస్కర్, మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, తిరుమల డీఎం విశ్వనాథం పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.62 లక్షలు మాయం

నాయుడుపేటటౌన్ : బ్యాంకులో నగదు డిపాజిట్ చేసిన కొద్దిసేపటికే ఖాతాలోని నగదు మాయం కావడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. వివరాలు.. మేనకూరుకు చెందిన గణపతి రఘురామయ్య అలియాస్ గురునాథం ఎల్‌ఐసీలో పనిచేస్తూ గూడూరులో నివసిస్తున్నాడు. మేనకూరు యూనియన్ బ్యాంకులో క్రాప్ లోన్ తీసుకుని ప్రతి నెలా వాయిదాలు చెల్లించుకుంటున్నాడు. ఈ క్రమంలోనే సెప్టెంబర్ వాయిదా కట్టకపోవడంతో అదే నెల 22వ తేదీన బ్యాంకు అధికారులు ఫోన్ చేశారు. వెంటనే వాయిదా నగదు జమ చేయాలని సూచించారు. ఈ మేరకు గురునాథం మరుసటి రోజు 23వ తేదీన తన బ్యాంకు ఖాతాల్లో అప్పటికే ఉన్న మొత్తానికి తోడు మరింత నగదు జమ చేశాడు. అయితే అదే రోజు గురునాథం ఖాతా నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఆన్‌లైన్‌లో మొత్తం రూ.1,62,300 విత్‌డ్రా చేసేశారు. ఈ విషయం తెలుసుకున్న గురునాథం నిర్ఘాంతపోయాడు. వెంటనే బ్యాంకు అధికారులను సంప్రదించాడు. దీంతో అధికారులు గురునాథం ఖాతాను పరిశీలించగా, నగదు కాజేసిన వారు తర్వాత గంటలోనే ముంబయి పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రూ.లక్ష, ఢిల్లీలోని బ్యాంకు నుంచి రూ.62,300 డ్రా చేసినట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. గురునాథం మాట్లాడుతూ బ్యాంకు అధికారులు వాయిదా సొమ్మును జమ చేసుకోవడంలో జాప్యం చేయడం వల్లే తనకు నష్టం వాటిల్లిందని ఆరోపిస్తున్నాడు. దీనిపై స్థానిక పోలీసులతోపాటు సైబర్ క్రైమ్ పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు వెల్లడించాడు.

సీసీ టీవి, సెక్యూరిటీ అలారమ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి : యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఈ నెల 7వ తేదీ నుంచి 13 రోజుల పాటు పురుషులకు సీసీ టీవి ఇన్‌స్టాలింగ్, సర్వీసింగ్‌తో పాటు సెక్యూరిటీ అలారమ్, స్మోక్ డిటెక్టర్‌పై పూర్తి ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ పి. సురేష్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతానికి చెందిన 10వ తరగతి ఉత్తీర్ణులైన 19 ఏళ్ల నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ పురుషులు అర్హులన్నారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కి హాస్టల్ సౌకర్యం, ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీ ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ అందిస్తామని తెలిపారు. ఆసక్తిగలవారు ఆధార్, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫోటోలతో సంస్థకి వచ్చి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. ముందుగా పేరు నమోదు చేసుకున్న ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇతర వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11–48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 83091 64644 సంప్రదించాలని సూచించారు.

విజన్-2047పై వర్క్‌షాప్

తిరుపతి అర్బన్ : స్వర్ణాంధ్ర 2047 విజన్‌పై మంగళవారం కలెక్టరేట్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, రైతు సంఘాల నేతలు, వాణిజ్య సంస్థల ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడారు. మండలం, డివిజన్, జిల్లా స్థాయి వారీగా విజన్‌ల జాబితా తయారుచేసి ఇవ్వాలని ఆదేశించారు. అందరి సలహాలు తీసుకుని, సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడేలా విజన్ ఉండాలని సూచించారు. జిల్లా ఇన్‌పుట్స్ ఆధారంగా ఐదేళ్లకు సరిపడే యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని వెల్లడించారు. కార్యక్రమంలో తిరుపతి కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ చరణ్‌తేజరెడ్డి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు బంద్

తిరుపతి క్రైమ్: జిల్లాలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడ్డాయి. షాపుల్లో పనిచేసే సిబ్బంది ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 350 మంది సేల్స్‌మన్లు, 149 మంది సూపర్‌వైజర్లు, నైట్ వాచ్‌మన్లు పనిచేస్తున్నారు. వీరికి ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా కూటమి ప్రభుత్వం ప్రయివేటు మద్యం షాపులకు నోటిఫికేషన్ జారీ చేయడంతో వారు విరుచుకుపడ్డారు. ఉదయం 10 గంటల నుంచి మద్యం దుకాణాలు తెరవకుండా వారి ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సంబంధిత అధికారులు వారితో చర్చలు జరపడంతో సాయంత్రం తర్వాత దుకాణాలు తెరుచుకున్నాయి.

ఐదేళ్లుగా పని చేస్తున్నాం

ఐదేళ్లుగా వైన్‌షాపులో పని చేస్తున్నాం. మేము ఎవరికీ వ్యతిరేకం కాదు.మద్యం దుకాణాల్లో పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలి. ఇప్పుడు మమ్మల్ని తొలగిస్తే రోడ్డున పడతాం

– చరణ్‌కుమార్, సూపర్‌వైజర్

ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌ఓగా శ్రీనివాసులు



తిరుపతి మంగళం : ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓగా శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం పరిరక్షణ, అడవుల సంరక్షణే లక్ష్యంగా విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు అవసరమైన సిబ్బందిని రిక్రూట్ చేయాల్సి అవసరం ఉందన్నారు. ఎక్కడైనా ఎర్రదుంగలను తరలిస్తుంటే 9440810070, 9440810302 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

‘ఆదరణ’ పరిశీలన



వృద్ధులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి సరిత

తిరుపతి లీగల్ : సీనియర్ సిటిజన్ డే సందర్భంగా తిరుపతిలోని ఆదరణ వృద్ధాశ్రమాన్ని ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వై.సరిత మంగళవారం సందర్శించారు. వృద్ధులకు అందుతున్న వసతులు, ఆహార పదార్థాలను పరిశీలించారు. సీనియర్ సిటిజన్ల యోగక్షేమాలు విచారించారు. వారికి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు వనమతమ్మ, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

11 నుంచి తిరుపతిలో రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుమల బైపాస్‌రోడ్డులోని మున్సిపల్ పార్క్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు 5 నుంచి 17 ఏళ్లలోపు ఉన్న స్కేటర్లు అర్హులు. ఈ పోటీల్లో అర్హత సాధించిన వారు నవంబరులో కాకినాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని రోలర్ స్కేటింగ్ జిల్లా కార్యదర్శి మంత్రి పురుషోత్తం తెలిపారు. వివరాలకు 70135 04345 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఎంఈడీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది జూలైలో నిర్వహించిన ఎంఈడీ 4వ సెమిస్టర్ ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం దామ్లా నాయక్ తెలిపారు. ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి



లోగో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తదితరులు

తిరుపతి సిటీ : దక్షిణ భారతంలో సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను స్వాగతిస్తున్నామని, ఇందుకోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎన్ఎస్ఎల్ఏ) ఆధ్వర్యంలో నీడ్ ఆఫ్ సుప్రీంకోర్టు బెంచ్ ఇన్ సౌత్‌ఇండియా అనే అంశంపై ఎస్వీయూ సెనేట్ హాల్‌లో చేపట్టిన సదస్సులో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు ఆవశ్యకతను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో చర్చించేందుకు ప్రయత్నిస్తానన్నారు. బెంచ్ ఏర్పాటుతో చాలా మంది పౌరులకు సత్వర న్యాయం జరిగే అవకాశం ఉంటుందని పలువురు వక్తలు, న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా ఎన్ఎస్ఎల్ఏ లోగో ఆవిష్కరించారు. ఉస్మానియా యూనివర్సిటీ మాజీ డీన్ గాలి వినోద్ కుమార్, సీనియర్ అడ్వొకేట్ కేఎస్ వాసు, కొండలరావు, ఎన్ఎల్ఎస్ఏ ప్రెసిడెంట్ పి.సుందరరాజు, సెక్రటరీ ఈఆర్ మోహన్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



ట్రోఫీని అందుకుంటున్న జూనియర్ బాలుర రాష్ట్ర జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జాతీయ స్థాయి లాక్రోస్ చాంపియన్‌షిప్, ఫెడరేషన్ కప్‌ను లాక్రోస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించింది. ఈ పోటీలకు 19 రాష్ట్రాల నుంచి బాలబాలికల జట్లు హాజరయ్యాయి. మన రాష్ట్రం నుంచి జూనియర్, సీనియర్ బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో జూనియర్ బాలుర జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, సీనియర్ బాలుర జట్టు తృతీయ స్థానంలో కాంస్య పతకం సాధించాయి. తొలిసారిగా సౌత్ జోన్ నుంచి రాష్ట్ర జట్టు బంగారు పతకం సాధించడం అభినందనీయమని లాక్రోస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సురేందర్‌రెడ్డి తెలిపారు. అలాగే బాలుర విభాగం నుంచి ముగ్గురు, బాలికల విభాగం నుంచి ఒక్కరు మొత్తం నలుగురు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన రాష్ట్ర లాక్రోస్ జట్టు క్రీడాకారులను ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడ డాక్టర్ పీ.మునికృష్ణయ్య, కోచ్ శివ అభినందించారు.

ఆర్చరీలో గణేష్ మణిరత్నం సత్తా



స్వర్ణపతకంతో గణేష్ మణిరత్నం

నాయుడుపేటటౌన్ : చైనాలో సెప్టెంబర్ 27వ తేదీ నుంచి నిర్వహిస్తునన టాఫయ్-2024 ఆసియా ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్‌లో నాయుడుపేటకు చెందిని క్రీడాకారులు గణేష్ మణిరత్నం ప్రతిభ కనబరిచాడు. వ్యక్తిగత విభాగంతో బంగారు పతకం సాధించాడు.

ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



రేణిగుంట : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రత్యేక విమానంలో చేరుకున్న ఆయనకు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు స్వాగతం పలికారు.

కిక్కే కిక్కు!

- ప్రైవేట్ మద్యం దుకాణాలకు పచ్చజెండా
- జిల్లా వ్యాప్తంగా 227 దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ
- 9వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం
- లాటరీ పద్ధతిలో 11న దుకాణాల కేటాయింపు
- తిరుపతిలో మద్యం షాపుల నియంత్రణ నామమాత్రమే!



తిరుపతి క్రైం: కూటమి ప్రభుత్వం ప్రయివేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు పచ్చజెండా ఊపేసింది. వీధికో మద్యం షాపు ఏర్పాటు చేసి ఆదాయం రాబట్టేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా 227 మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ మంగళవారం నోటిఫికేషన్ జారీచేసింది. దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లోనే ఈ నెల 9వ తేదీ వరకు స్వీకరించేలా చర్యలు చేపట్టింది. ప్రైవేట్ మద్యం దుకాణం దరఖాస్తు కోసం రూ.2 లక్షల వరకు నాన్ రిఫండబుల్‌గా నిర్ణయించింది.

చెప్పిందేమో 20 శాతం వచ్చేదేమో 14 శాతం!

మద్యం వ్యాపారులకు ఆశ కలిగిస్తూ మొదట్లో 20 శాతం ఆదాయం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే పాలసీ విడుదలైన అనంతరం పన్నుల రూపంలో మినహాయిస్తే వారికి 14 శాతం వస్తుందనే విషయాన్ని దాచి పెట్టింది. దీంతో మద్యం దుకాణాలను ఆశించే ఆశావహులు సైతం కొంత నిరుత్సాహపడుతున్నారు.

స్లాబ్ వివరాలు ఇలా..

ప్రైవేట్ దుకాణాలకు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ కూటమి ప్రభుత్వం లైసెన్స్ ఫీజును భారీగా పెంచేసింది. మొత్తం నాలుగు స్లాబులుగా విభజించారు. జిల్లాలో ఉన్న జనాభా లెక్కల ప్రకారం లైసెన్స్ ఫీజులు నిర్ణయించారు. ప్రస్తుతం తిరుపతి జిల్లా పరిధిలో ఉన్న జనాభా లెక్కల ప్రకారం రెండు స్లాబులు మాత్రమే వర్తిస్తాయి. ఇందులో 50 వేల లోపు జనాభా ఉంటే స్లాబ్ – 2గాను, 50 వేల పై నుంచి 5 లక్షల లోపు ఉంటే స్లాబ్–3గా విభజించారు. స్లాబ్‌టు ప్రకారం 64 దుకాణాలు చూపించిన అధికారులు, ఇక్కడ ఏడాదికి లైసెన్స్ ఫీజును రూ.55 లక్షలుగా నిర్ణయించారు. స్లాబ్– 3లో 163 దుకాణాలు ఏర్పాటు చేసి ఏడాది లైసెన్స్ ఫీజును రూ.65 లక్షలుగా నిర్ణయించారు. ఏడాది అనంతరం లైసెన్స్ ఫీజులో పది శాతం పెంచనున్నారు.

పాలసీ వివరాలు

- జిల్లాలో 11 ఎక్సైజ్ స్టేషన్లకుగాను ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు
- దరఖాస్తు ఫీజు నాన్ రిఫండబుల్ కింద రూ.2 లక్షలు చెల్లించాలి
- ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు
- 11వ తేదీన ఉదయం 8 గంటల నుంచి లాటరీ ద్వారా షాపులు కేటాయింపు
- 21 ఏళ్లు పైబడిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి
- 12వ తేదీన ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయించనున్నారు. వీరికి 2024- 2026 సెప్టెంబర్ 30 వరకు లైసెన్స్ ఫీజు కలిగి ఉంటుంది.

కల్లుగీత కార్మికులకు మొండి చెయ్యే!

కల్లుగీత కార్మికులకు అండగా ఉంటామంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రైవేటు మద్యం షాపుల్లో మొండి చేయి చూపించేలా ఉంది. ప్రస్తుత నోటిఫికేషన్‌లో కల్లుగీత కార్మికుల ప్రస్తావన లేదు. ఈ విడత ప్రక్రియ పూర్తయితే గీత కార్మికుల కోసం ప్రత్యేక నోటిఫికేషన్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

నిషేధిత ప్రాంతాలు

తిరుపతి నగరం ఆధ్యాత్మిక ప్రాంతం నేపథ్యంలో రైల్వేస్టేషన్, తిరుపతి బస్టాండ్, అలిపిరి నందిసర్కిల్, లీలా మహల్ సర్కిల్, విష్ణునివాసం, శ్రీనివాసం, రూయా ఆస్పత్రి. స్విమ్స్ ఆస్పత్రి ప్రాంతంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయరాదు.

ప్రధానంగా తిరుపతిలో 32, నాయుడుపేటలో –13, గూడూరులో–12, సూళ్లూరుపేటలో 14, వెంకటగిరిలో 09, పుత్తూరులో 7, శ్రీకాళహస్తిలో 12, తిరుపతి రూరల్‌లో 12 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు.